# కవితారాధన

అతడు వేళతప్పకుండా సాయంత్రంకాగానే లైబ్రరీకి వెళ్తాడు. వార్తా పత్రికలు చదువుతాడు. పదేళ్ళ వయసు వచ్చినప్పటినుండీ ఆ లైబ్రరీలో అతడికి సభ్యత్వముంది. బీరువాలలో ఉన్న పుస్తకాలలో తనకు నచ్చిన పుస్తకం తీసుకుని రిజిస్టర్లో సంతకంపెట్టి, నాలుగుమైళ్ళదూరంలో ఉన్న ఇల్లు చేరుకుంటాడు.

అతడిపేరు నిత్యానందం. ఖద్దరు పైజామా లాల్చీ, ఎంతదూరపు నడక కయినా ఓర్చే మొద్దుచెప్పులు, రివటలాఉండే శరీరంతో ఆ నాలుగుమైళ్లూ ఒక గంటలో దారిలో కలిసినవాళ్లతో కబుర్లుచెబుతూ నడుస్తాడు. అతడిలో ఏ ప్రత్యేకతనూ చూడనివాళ్లు బజారునపోయే సామాన్యుడనుకుంటారు. కాని బాగా పరకాయించి చూసినవాళ్లకు అతడి ముఖంలో సకల విద్యలూ ఆకళింపుచేసుకున్న వికాసమూ తేజస్సు ప్రస్ఫుటంగా కనబడతాయి.

నిత్యానందం బ్రహ్మచారి. తల్లిదండ్రులులేని కారణంగా తాతా బామ్మల దగ్గర పెరిగాడు తాతగారు తిరుపతి వేంకట కవులంత పండితుడు. తన విద్యలన్నీ మనమడికి నూరిపోశాడు. ఆ ఊరి హైస్కూల్లో చదువు ముగించి, నిత్యానందం పక్క-ఊళ్లో కళాశాలలో ప్రవేశించి పట్టభద్రుడయ్యాడు.

అతడికి గ్రామీణ జీవితమంటేను, గ్రామప్రజలంటేను అభిమానం. వాళ్లను ఎదురుగా కూర్చోబెట్టుకుని, వార్తలూ విశేషాలూ వివరిస్తాడు. వాళ్ళ క్షేమసమాచారాలు కనుక్కుంటాడు. అవసరమైన సహాయం చెయ్యటంలో వెనుకాడడు. వాళ్ళతో అతడు కాలక్షేపం చేస్తుంటే వేళ ఎంతయిందీకూడా తెలియదు.

టీచరంటే బడిపంతులనే అర్థం. కాని- అతడిని ఎవరూ ఆ ఊళ్లో టీచరని పిలవరు. ఆ గ్రామంలో ఐదువందల గడపఉంది. చదువురాని వాళ్లూ వచ్చిన వాళ్ళూ రైతుకుటుంబాలూ ఉన్నాయి. పెద్ద ఆఫీసులూ, కోర్టులూ లేవు కనుక

పెద్ద ఉద్యోగస్తులులేరు. చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకునేవారూ వ్యాపారం చేసుకునేవారూ ఉన్నారు. వర్తక వ్యాపారం బాగా సాగుతోంది.

నిత్యానందం ఉంటున్న ఇల్లు తాతగారు కట్టిన పెంకుటిల్లు. బ్రిటీషువారి కాలంనాడు కట్టిన ఆఫీసు బిల్డింగ్‌లా ఉంటుంది. నడుమ పెద్దహాలూ, నాలుగు పక్కలా దించిన వసారాలూ ఇంటిచుట్టూ ఖాలీస్థలమూ పెద్ద పెద్ద చెట్లూ ఉన్నాయి. ఆ యింటికి ప్రహరీ గోడలేదు. కాని ముళ్ళచెట్లతో గోడకట్టినట్టుగా ఉంటుంది ఇంటిముందు కర్రగేటు.

ఆ యింటికి వెంకటాద్రి అని పేరుపెట్టి ఎత్తుగా బోర్డుకట్టారు.

ఇంటికి వెనకవైపు వసారాకు, వంటకూ భోజనాలకూ అనుకూలమైన వసతులు కల్పించుకున్నారు. పెరట్లో మంచినీళ్ళబావి గిలక ఉన్నాయి. పెరట్లో కూరగాయలూ ఆకుకూరమడులూ పళ్ళచెట్లూ బామ్మ వేసింది. ప్రతిరోజూ ఉదయపు వేళ నిత్యానందం నీళ్లు తోడుతూఉంటే కాలవలద్వారా చెట్లకు నీరు అందేటట్టు చేస్తుంది బామ్మ.

ఆమెను అందరూ మాచమ్మని పిలుస్తారు కాని, అసలు పేరు మహాలక్ష్మి. పనిచేసినా మాట్లాడినా ఎంతో నిదానమూ నేర్పూ ఆమెలో కనబడతాయి. ఆమె వయసులో ఉన్నప్పుడు అన్ని విషయాలూ ఆకళింపుచేసుకుని సకలశాస్త్రాలూ తెలిసిన మనిషిలా మనమడిని తీర్చిదిద్దింది. ఆమెకామనమడంటే ప్రాణంతో సమానం. ఉన్న రెండెకరాల భూమిమీద వచ్చే రాబడితో సామాన్యంగా అయినా సంతృప్తిగా జీవిస్తున్నారు.

నిత్యానందం ఒకవైపు వసారాలో సాయంకాలపు వేళల్లో వయోజనులకు విద్యనేర్పుతాడు. పగటివేళ పిల్లలకు అక్షరాస్యతా పథకంకింద అక్షరాలూ అంకెలూ నేర్పుతాడు. భోజనం కాగానే విద్యార్థులకు సంస్కృతం కొందరికీ, ఆంగ్లభాషలో పాఠాలు కొందరికీ చెబుతాడు. రైతాంగానికి రేడియో టీ.వి. కబుర్లు వినిపిస్తాడు. అతడికి ఒకనిమిషమైనా తీరికలేని బడిపంతులుగా ఆ గ్రామంలో పేరు పడిపోయింది.

అతడు అందరికీ తలలో నాలుకలా ఉంటాడు. ఆ గ్రామస్తులకు అతడిని గురించి ఏ విషయంలో ఏంచేస్తాడో తెలుసు. అలాగే గ్రామస్తులను గురించి ఎవరు ఎటువంటివారో అతడికి తెలుసు.

కాని - అతడిని గురించీ అతడి వైదుష్యాన్ని గురించీ అతడి మేథాశక్తిని గురించీ ఒక్క బామ్మ మాచమ్మకు తప్ప ఎవరికీ బాగా తెలియదు.

ఎట్లా తెలుస్తుంది ? రైతుల్లో రైతుగా, పిల్లల్లో పిల్లవాడుగా, పెద్దలలో పెద్దవాడుగా, వినయవిధేయతలతో మెలగుతుంటే ఇరుగుపొరుగువారు మంచివాడను కుంటారు గాని - పండితుడనుకుంటారా ?

ఒకనాటి రాత్రివేళ - అంటే పదిగంటల సమయం. మాచమ్మకు నిద్ర పట్టలేదు. మంచమ్మీద లేచి కూర్చుంది. దక్షిణపువైపుగాలి చల్లగా వీస్తుంటే హాయిగా ఉందని మంచమ్మీదికి ఒరిగిపోయింది మళ్ళీ.

ఎక్కడినుంచో పద్యాలు చదువుతున్నట్టుగా రాగం తీస్తున్నట్టుగా మగత నిద్రలో ఉన్న ఆమెకు వినబడటం మొదలుపెట్టింది. కొంతసేపటికి పాటలు పాడుతున్నట్లనిపించింది.

నిత్యానందానికి వీధివైపు వసారాలో పడుకోవటం అలవాటు. ఆమె కిటికీలో నుంచి తొంగిచూసింది. దీపం ముందర కూర్చుని రాస్తూ వాటిని చదువుతూ మధ్యమధ్య కలంతో గడ్డాన్ని రాసుకుంటూ ఆలోచిస్తున్నాడు నిత్యానందం.

ఆమె చూసింది గాని పలకరించకుండా మళ్ళీ పడుకుంది.

అవే- మధ్య మధ్య పద్యాలూ పాటలూ రాగయుక్తంగా వినబడుతుంటే 'ఆ ! హాఁ ? మానిత్యకంఠం శ్రావ్యమైనదే. ఈ మధ్య ఈ విద్య నేరుస్తున్నాడు కాబోలు' అనుకుంది. రోజూ ఇల్లుడిచ్చేటప్పుడు అతడి మంచం దగ్గర నలిపి పారేసిన కాగితాలు విప్పిచూసి భద్రపరచేది.

నిత్యానందం తన దినచర్యకు భంగం రానిచ్చేవాడు కాదు. ఈ మధ్య ఒక కపిలగోవును దూడతో కూడా కొన్నాడు సరదాపడి. దానితో కొంత కాలక్షేపం.

"ఇదెందుకురా మనకు ?" అంది మాచమ్మ.

"పెరట్లో గడ్డి వృథాగా పోతున్నది. ఆ గడ్డంతాకోసి దానికివేస్తే మేస్తుంది. పొలం మీదినుంచి వచ్చినగడ్డికూడా చాలకపోతే కొందాం. పెరట్లో ఆవు ఉంటే ఎంతమంచిది ?" అని సర్దేశాడు. కాని అసలుసంగతి మాచమ్మ ఈమధ్య రాత్రిళ్లు

భోజనం మానేసింది. రాత్రిళ్ళు పాలు తాగుతుందని కొన్నాడు. అందుకు ఆమెకూ మనసులో సంతోషమే. ఉదయమేలేచి దాన్ని ముఖంచూసి దణ్ణంపెట్టుకుంటుంది. గోమయంతో వంటయిల్లు అలికి శుద్ధి చేసుకుంటుంది. శుక్రవారంపూట గోమహాలక్ష్మి ముఖానికి పసుపుపూసి బొట్టుపెట్టి పూజచేస్తుంది.

నిత్యానందం అప్పుడప్పుడు రాసిన పద్యాలూ గేయాలూ ఒకపుస్తకంలో ముత్యాలవంటి అక్షరాలతో రాసుకుని స్వయంగా బైండు చేసుకుంటున్నాడీమధ్య. "ఖండకావ్యము రచయిత - వెంకటాద్రి' అని కింద సంతకంపెట్టి, తేదీవేస్తున్నాడు. ఆ పుస్తకాన్ని దిండుకింద పెట్టుకుని మార్పులూ చేర్పులూ చేస్తున్నాడు. అతడు నలిపి పారేసిన కాగితాలు మాచమ్మదగ్గర ఒకపెద్ద కట్టగా తయారయింది.

రాత్రివేళల్లో అతడు గొంతెత్తి శ్రావ్యంగా గానంచేస్తుంటే "అన్నీ తాత పోలికలు!" అనుకునేది.

నిత్యానందం అలా బైండుచేసుకున్న పుస్తకాలు ఒకటి తరువాత ఒకటి పన్నెండు గాజు తలుపులున్న బీరువాలో భద్రపరచుకుని, చూసుకుంటూ ఉండేవాడు. తనకు మరీ ఇష్టమైన కవితలపుస్తకం మాత్రం దిండుకింద పెట్టుకుని రాత్రిళ్ళు చదువుకునేవాడు.

ఆ గ్రామంలో లైబ్రరీ ముందర ఖాళీస్థలం చాలా ఉండటంచేత శాసన సభ్యులు పందిళ్ళువేసి, రాజకీయసభలను ఎన్నికల ముందర జరుపుకుంటున్నారు. అప్పుడప్పుడు మంత్రులుకూడావచ్చి ఉపన్యాసాలివ్వటం పరిపాటయింది. ఆ సభలు జరుగుతున్నప్పుడు సాంస్కృతిక కార్యక్రమాలుకూడా ప్రజాకర్షణకోసం జత చేయటం ఈ మధ్యనే ప్రారంభించారు. హరికథలు బుర్రకథలూ వినటానికి చుట్టుపక్కల గ్రామాలనుండికూడా ప్రజలు రావటం, తెల్లవారు ఝామువరకూ కాలక్షేపంగా ఉంటోంది. అప్పుడప్పుడు మార్పుగాఉంటుందని కవులనుకూడా ఆహ్వానించి హాస్యంగా, వ్యంగ్యంగా మధ్యమధ్య స్తోత్రాలతో కావ్యగానంచేస్తుంటే ప్రజలు వాటినీ విని ఆనందిస్తున్నారు.

ఒక సంవత్సరం-ఎన్నికల ముందర జరిగేసభకు పేరూ ప్రతిష్ఠాగల కవులను ఆహ్వానించి, గత ఐదు సంవత్సరాలుగా ఆ నియోజకవర్గంలో జరిగిన అభి

వృద్ధిని గురించి కవితలు రాయించి ప్రజలకు తెలియచెప్పాలన్న ఆలోచన శాసన సభ్యుడికివచ్చింది. పట్టుశాలువలతో పండితసన్మానంచేయాలనికూడా తీర్మానించు కున్నాడు.

ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి.

ఆహ్వానింపబడిన కవులు పదిమంది. వీరందరికీ, కలిగిన కుటుంబాలలో ఇద్దరూ ముగ్గురూ వంతున నాలుగిండ్లలో భోజన వసతి సౌకర్యాలు చేయబడ్డాయి. రాత్రిళ్లు ఆరుబయట నులకమంచాలువేసి దుప్పట్లు దిండ్లూ అమర్చారు.

గ్రామంలో ప్రజలు నాలుగుగంటలకే లైబ్రరీముందర పరచిన చాపలమీదికి చేరుకున్నారు. కవులు బసచేసినచోట చిక్కటిపాలు గ్లాసెడు వంతున తాగి వేదిక మీదికి చేరుకుని కబుర్లు చెప్పుకుంటున్నారు. గ్రామాలలోకివచ్చిన కవులు జరీఅంచు ధోవతులతో శాలువలు కప్పుకుని ప్రత్యేకంగా కనబడుతున్నారు.

తాము బాగా రాయగలమన్న ఆత్మస్థైర్యము రచయితలకు ఉండటం సహజం. అందులోనూ కొందరికి తామే రాయగలమన్న ఆత్మస్థైర్యం రవంత అధికంగా ఉండటమూ సహజమే. కాని కొందరు పైకి చాలా గంభీరంగా కనబడ తారు. కొన్ని మర్యాదలు పాటిస్తారు. మంచినే పైకెత్తి చూపుతారు. పదిమందిలో పేరు తెచ్చుకుంటారు.

''ఆయన రచనలన్నీ విజ్ఞానపు తునకలేననుకోండి. మచ్చుకుఒకటి చదివితే చాలు ఆయనను మనం పూర్తిగా చదివినట్టే. మహానుభావుడు కదండీ"

"అందుకుసందేహమా? మనంచెబితే వినేవారులేరుగాని-లేకపోతే ఈ పాటికి సాహిత్య పీఠాధిపత్యుడిని చెయ్యక పోయామా?''

''అంతేలేండి. ఇది రాజుల కాలమా ఘనసన్మానాలకు?"

"ఇప్పుడేంతక్కువైంది?"

ఈ గుసగుసలు ఒకచోట-

మరొకచోట-

''విన్నావుటయ్యా. ఆ"ఏకలవ్య" దేవదత్తంకూడా వచ్చారట''

"అందరికీ ఆహ్వానాలందాయన్నమాట. నిజానికి వాళ్ళిద్దరూ మనతో చేర్చ తగ్గవాళ్ళా అని? ఎవరినో ఆశ్రయించి ఉంటారు.''

''పోనీలెండి. నలుగురితో కలవాలని వాళ్ళకూఉండటం సహజమేగా?"

"ఉబలాటం ఉండచ్చు. సత్తా ఉండద్దూ?"

"నలుగురినీ కలుస్తూఉంటే అదేవస్తుంది''

''నేను ఏడ్చాను" ''నేను స్పృహతప్పిపోయాను'' నేను కుమిలిపోయాను'' అని చదువుతారు కాబోలు''

''అవే చదవనీయరాదా? వాళ్ళసరదా తీరుతుంది. ప్రజలకు బాగా అర్ధమూ అవుతుంది''

''ప్రతివాడూ రాసేవాడే అన్నాడట వెనకటికొకాయన. రాసే వాళ్ళంతా కవులేనా ? రసోత్పత్తిని సృష్టించగలరా ? అసలు సిసలైన కవులు కొంతమందే ఉన్నారు. వాళ్ళకు సన్మానాలు పురస్కారాలు జరిగాయంటే చేసేవారికీ చేయించు కున్నవారికీ గౌరవం. అంతేగాని, డబ్బువిరజిమ్మి సన్మానాలు చేయించుకుని బిరుదులిప్పించుకోవటమూ, నలుగురిలో మేమే కవులమంటూ శాలువలు కప్పుకుని తిరగటమూ గౌరవం కింద లెక్కా ?" అని ఆయన అందరితోటీ అనేవాడట. మీరు వినలేదా ?''

"విన్నాను, గాని అవన్నీ పట్టించుకోను.''

''పోన్లెండి అందరూ వస్తున్నారు. వింటే బాగుండదు."

"మనలో మనమాట. ఈ పదిమందిలో ఎంతమంది నిజంగా రాసేవాళ్లు ? ఆలోచించారా మీరు?"

''అబ్బా, అవన్నీ మనకెందుకు ?" విసుక్కున్నట్టుగా అన్నాడాయన.

"నీవు సామాన్యుడవా" అని మనసులో గొణుక్కుని పెదవి విరుచుకుంటూ మౌనం వహించాడప్పటికి కొండేలరాయుడు.

ఇంతలో ప్రచారపు సంగీతధ్వని హెచ్చింది. ''మన మంత్రిగారి కారు

బయలుదేరి ఊరిముందరికి వచ్చింది'' అంటూ జనసందడి అధికమయింది. వాలంటీయర్లు అందరినీ సర్ది కూర్చోబెట్టున్నారు.

అంతలో మంత్రిగారు, వారివెనుక మరో ఇద్దరు పెద్దలు ఆ నియోజకవర్గపు శాసనసభ్యుడూ గబగబా వచ్చి వేదికనలంకరించారు. ప్రార్థనతరువాత అంతకు ముందు తెప్పించిన చేమంతి పూలదండలు వేదికమీద ఉన్నవారందరికీ గ్రామపెద్ద వేసి నమస్కరించాడు.

మామూలుగా రాజకీయసభలలో జరిగినట్టే మంత్రిగారి ప్రసంగం శాసనసభ్యుడి ప్రసంగం సాగిపోయింది. ఎన్నికలముందు వారు చేయదలపెట్టిన ప్రజాసౌకర్యాలనూ ప్రణాళికలో చేర్చబోయే పేదప్రజానీకానికి అదనపు సౌకర్యాలను ఏకరువుపెట్టారు. మంత్రిగారికి మరొక కార్యక్రమం ఉన్నందున కవితాగానం ప్రోగ్రాం ముందుగా పెట్టారు.

శాసనసభ్యుడు మైక్ దగ్గరిగావచ్చి ''మంత్రిగారు మన నియోజకవర్గం మీద గల అభిమానంకొద్దీ రెండు ప్రోగ్రాములు రద్దు చేసుకున్నారు. వారికి కవుల మీద ప్రత్యేకమైన అభిమానం. అందుచేత ఈ సభకు కవులనుకూడా ఆహ్వానించి, వారిని సన్మానించి, వారి ఆశీర్వచనాలు కూడా పొందాలని ఆశించారు. ముందుగా సుప్రసిద్ధ కవులూ అనేక బిరుదులూ గల పండిత కేశవకృష్ణానంద స్వామిగారు తమ కవితలను వినిపించవలసినదిగా కోరుతున్నాము" అన్నాడు.

పండిత కేశవకృష్ణానందస్వామి వారు లేచినిలబడి మెడలోవేసిన పూల దండను సరిచేసుకుంటూ ''సభకు నమస్కారం. మంత్రిగారికీ శాసనసభ్యులకూ నా మీద అపారమైన గౌరవం. 'కాదు, కూడదు' అంటే బాగుండదని పిలవగానే వస్తూ ఉంటాను'' అంటూ రెండు పద్యాలలో స్తోత్రసుధను నింపి మైక్ ముందర గంభీరంగా చదివి, అటు తరువాత మంత్రిగారూ శాసనసభ్యుడూ సాధించిన విజయాలను మరోనాలుగు పద్యాలలో చదివి, వారిద్దరికీ మరింత ఉన్నతపదవులు రావాలన్న ఆశీర్వచనాలతో ముగించారు.

వారిని జరీపూలశాలువాతో మంత్రిగారు స్వయంగా సత్కరించారు హర్షధ్వానాలమధ్య.

తరువాత ఒకరిద్దరు ప్రజల కష్టాలు, ప్రభుత్వసహాయాన్ని గురించి వచ్చిన కవిత్వం చదివారు.

వారిద్దరినీ కూడా మంత్రిగారు స్వయంగా సన్మానించి "కార్యక్రమం సాగనివ్వండి, అవతల మరొక కార్యక్రమం ఉన్నది. కార్యకర్తలు ఎదురుచూస్తూ ఉంటారు" అని లేచి కారులో కూర్చున్నారు. శాసనసభ్యుడూ వారితో వచ్చిన పెద్దలూ కూడా ఆ కారులో వెళ్ళారు.

ఆ తరువాత కార్యక్రమం గ్రామపెద్ద నిర్వహించాడు. కవులు తమ తమ పద్యాలను చదువుతుంటే సభ్యులు "బాగుంది బాగుంది" ''బలే బలే'' "ఆహా ! ఎంతబాగా చెప్పాడండీ" అంటూ ప్రోత్సాహకరంగా శ్లాఘిస్తుంటే ఒక్కొక్క పాదం రెండేసిసార్లు చదువుతూ మధ్యమధ్య సభలోని వారి ముఖాలు చూస్తూ సాగించారు-కవులు తమ కవితాగానాన్ని.

చివరగా చదివిన ఇద్దరు తమ పుస్తకాలలోనుంచి చూసి చదివారు గాని ఆ చదవటం ప్రజల నాకర్షించలేకపోయింది. మొత్తమ్మీద అందరూ సత్కరింపబడ్డారు.

నిత్యానందంకూడా సభకు వచ్చాడు. అక్కడున్న వారందరికీ అతడు పరిచయమే.

''ఈయనను వేదికకు దగ్గరగా కూర్చోబెట్టండి" అని ఒకరిద్దరు లేచి నిలబడ్డారు.

"ఆఁ, చెట్టుకింద పాఠాలు చెప్పే బడిపంతులు ఆయనకేం తెలుస్తుంది ఈ కవిత్వం ?'' అని సభికులు వాళ్లల్లో వాళ్ళే సర్దుకుని కూర్చున్నారు.

మిగతా కార్యక్రమమంతా ముగిసింది.

కవులు వారివారి విడిది గృహాలకు బయలుదేరారు. క్రిందటిరోజు వచ్చినట్టే ముగ్గురు కవులు నిత్యానందం ఇంటికి శాలువలు కప్పుకుని వచ్చారు. కాళ్లు కడుక్కుని భోజనాలకు కూర్చున్నారు. ఆ మరునాటి ఉదయం వెళ్ళిపోతారు కదా అని, మహాలక్ష్మమ్మ తీపిపదార్థంతో సాగనంపాలి అని పాయసం చేసింది. కవులు తృప్తిగా భోజనంచేశారు.

నిత్యానందం అప్పుడు చెప్పులు విడిచి లోపలికి వచ్చాడు. ''బామ్మా. వారందరికీ భోజనాలు పెట్టావా ?" అడిగాడు.

"ఇప్పుడే భోజనాలయ్యాయి. తాంబూలం పళ్లెం బయటపెట్టాను. నీవు భోజనానికిరా. ఆలస్యమైంది'' అంటూ వడ్డన ప్రయత్నం చేస్తున్నది.

ఇంతలో నిత్యానందం మంచాలమీద విశ్రమించినవారి దగ్గరికి వెళ్ళి "నేను ఆలస్యంగా వచ్చాను. మీ భోజనాలయ్యాయా ? తాంబూలం వేసుకున్నారా ?" మర్యాదగా అడిగాడు.

"మీకింత ఆలస్యమైందేం ? మేము సభపూర్తికాగానే వచ్చాము. భోజనానంతరం తాంబూలం సేవించటంకూడా అయింది. మీరు భోజనం చేసిరండి" అన్నారు.

అతడు భోజనంచేసిరాగానే "మీ ఊళ్ళోజరిగినసభకు మీరు రాలేదేమిటండీ?" అని మొదటి పండితు డడిగాడు.

కొంత ఆలోచించిన మీదట నిత్యానందం "నేనూ వచ్చాను. మీ కవితలు విన్నాను. పురస్కారాలను కళ్ళతోచూశాను. సంతోషపడ్డాను" అన్నాడు నవ్వుతూ.

"ఎక్కడ కూర్చున్నారు?"

"ఇది మా ఊరేకదా. మా కెవరూ గౌరవంచేసి కూర్చోమని మర్యాద చేయ నవసరం లేదుకదా. అందులో నేను చెట్టుకింది బడిపంతులనని ఈ ఊరందరికీ తెలుసు. నాకు కవిత్వమంటే ఏమీ తెలియదనీ తెలుసు. ఎక్కడకూర్చున్నా కార్య క్రమాల నన్నిటినీ చూశాను" అన్నాడు.

"కార్యక్రమాలు బాగున్నాయా?"

"ఈ గ్రామ ప్రజలకు అన్నీ బాగానేఉంటాయి. క్రిందటి సంవత్సరంవే ఈ ఏడు పెట్టినా ఉత్సాహంతో చూస్తారు. ఉబలాటంతో వింటారు"

"మా కవితలెట్లా ఉన్నాయంటారు? నేను కవిత్వం చదివి మంత్రిగారికీ శాసనసభ్యుడికీ శుభాకాంక్షలు తెలిపాను. ఆయన పొంగిపోయి ఈ జరీపూలశాలువా ప్రత్యేకంగా తెప్పించి కప్పారు"

అంతలో రెండవఆయన లేచి కూర్చుని "నేను ప్రజల కష్టసుఖాలనుబట్టి

మంత్రిగారు అభివృద్ధి పథకాలు రూపొందిస్తున్నారని పెద్ద పెద్ద సమాసాలతో వచనకవిత్వం చదివాను. మంత్రిగారు ఆనందించి స్వయంగా ఈ శాలువకప్పారు" అని చూపించాడు.

మాధవఆయన ఏంచెప్పాలా అని ఆలోచిస్తుంటే మహాలక్ష్మమ్మవచ్చి "నీ పుస్తకం కనబడలేదని నిన్నటినుంచీ గొడవచేస్తున్నావు. ఇప్పుడు పక్కలువేసే టప్పుడు కనబడ్డది. మళ్ళీ నీ దిండుకింద పెట్టేశాను" అంది నిత్యానందంతో.

ఆ కవి ఏమనుకున్నాడో తన దిండుకిందచూసుకుని పుస్తకంలేకపోవటంతో గాభరాపడి ఇటూ అటూ చూస్తూ వెతుక్కుంటున్నాడు.

"ఏమయినా పోయిందా?'' అడిగాడు నిత్యానందం.

''అదేనండీ ఒక పుస్తకం. నా కవితలన్నీ దానిలో రాసుకున్నాను. అవసర మైనప్పుడల్లా చదువుతూ ఉంటాను.''

''అయ్యో ఎంతపని జరిగింది? మా యింట్లో పోయిందంటారా? లేక బయట ఎక్కడైనా జారిపడిపోయిందా?" ఆదుర్దాతో అడిగాడు నిత్యానందం.

''ఇక్కడికి వచ్చేవరకూ ఉందండి. శాలువా పుస్తకం మంచమ్మీద పెట్టి చెప్పులు మంచంకింద పెట్టాను''

''అది ఛందోబద్ధమైన కవిత్వమా? లేక వచనకవిత్వమా? నాలుగుపాదాలు చదవండి. ఎక్కడయినా పడిపోయిందేమో వెతుకుతాను" అన్నాడు నిత్యానందం.

''ఎన్నోరాశాను కనుక ఇప్పటికిప్పుడు చూడకుండా చదవలేను" అన్నాడు దైన్యంతో.

"అలాగా! నేను చదువుతాను గుర్తుపట్టగలరా?''

''మీరు-మీరు-ఎట్లా చదవగలరు నా పద్యాలను?'' ఒణుకుతు ఆశ్చర్యానికి లోనైనాడు.

"నేను చదువుతానని గట్టిగా చెప్పలేను. కాని-ప్రయత్నిస్తాను. మీరుకూడా గమనించండి. మీరు సభలో చదివినప్పుడు విన్నానుకదా!'' అంటూ పద్మాసనం వేసుకుని చేతులు జోడించి, ఆ పుస్తకంలోఉన్న మొత్తం పద్యాలను రాగయుక్తంగా చదవటం మొదలుపెట్టాడు.

అంతలో మహాలక్ష్మమ్మ పని ముగించుకుని గడపదగ్గరగా చాపలేసుకుని కూర్చుంది.

పద్యాలు చదువుతున్నాడు నిత్యానందం రాగయుక్తంగా. పదాలు విరవటంతో పరిపూర్ణత చెందినట్లుగా చదువుతున్నాడు. భావయుక్తంగా చదువుతున్నాడు.

''సుమారు గంటయిన తరువాత ఇదేనా మీ పుస్తకం?'' అడిగాడు నిత్యానందం.

''అవునండి'' గొంతు తడి ఆరిపోయినట్టుగా ఉంది.

''మీ పేరు?''

''ప్రకాశరావు''

''మీ పేరు దానిమీద రాసుకున్నారా? ఎప్పుడు రాశారు ఈ పద్యాలు?''

ఈ ప్రశ్నలకు అతడిదగ్గర జవాబులేదు. పెద్దమనుష్యుల సిఫారసుతో శాసనసభ్యుడి లిస్టులో చేర్చబడ్డాడు. అతడి ఊరివాళ్ళు సమయానికి కొన్ని కవితలు రాసిచ్చి సహాయంచేస్తామన్నారు. కాని వారిపేర్లురాకపోవటంతో వెనకడుగు వేశారు. అదృష్టవశాత్తు అతడు నిత్యానందం ఇంట్లో విడిదిచేయటం సంభవించింది. మహాలక్ష్మమ్మ పక్కలు తీసి మడతచేస్తుండగా ఈ పుస్తకం మంచందగ్గర కనబడ్డది.

ఈ లోపల పండితులిద్దరు గజగజలాడి పోతున్నారు.

''అబ్బాయీ, మీ తాతగారి పేరేమిటి?''

''పండిత చాగంటి వెంకటశాస్త్రిగారు. వారే మా తాతగారు. వారే నా గురువులు-నా సర్వస్వం వారే''

"పండిత చాగంటి శాస్త్రిగారు మీ గురువులా? మీ తాతగారా?" ఆ పండితులిద్దరి కాళ్లూచేతులూ వొణికాయి.

"వారిదగ్గర మేమూ కొంతకాలం శిష్యరికం చేశాము. వారి షరతులు కఠినమైనవి. మనసువెన్న కాని మాట కఠినం" అన్నారు.

"మా తాతగారు చెప్తూఉండేవారుడు. విద్యను ఎవరూ దొంగిలించలేరని,

కాని-వారు అనేక సందర్భాల కనుగుణంగా రాసిన కాగితాలకట్ట పోయిందనేవారు. ఆ కట్టలోని పద్యాలమాదిరిగా ఉన్నట్టు మీరు చదివేటప్పుడే నా కర్థమైంది. రెండో వారు చదివినవి 'మా తాతగారు నిత్యం మాట్లాడేమాటలు" వచన కవిత్వంలా సభలో వినుపించాయి."

''వారి శిష్యరికం చేశాంకదా?"

''సభకు పెద్దపెద్ద పండితులు వస్తారని చెబితే గండపెండేరాలతో-రత్న కుండలాలతో సువర్ణఘంటా కంకణాలతో బంగారు దర్భముళ్ల ఉంగరాలతో జరీపూల శాలువలతో వస్తారుకాబోలు. నేనూ వారి దర్శనం చేసుకుందామని వచ్చాను. నా కెంతో ఆశాభంగమయింది'' అన్నది మహాలక్ష్మమ్మ.

''అమ్మా అరోజులు పోయాయి. ఆ కవిత్వాలూలేవు, ఆ పండితులూలేరు. ఆ సన్మానాలు చేసేవారూలేరు. అంతా నకిలీసరుకయిపోయిం దీరోజుల్లో అన్నా డాకపండితుడు.

"అలా అనకండి, ఈ కాలంలో గండపెండేరాలూ రత్నకుండలాలు సువర్ణ ఘంటాకంకణాలూలేవు గాని, సన్మానాలు లేవనుకోకండి. అన్నీ ఉన్నాయి. ఇచ్చే వారు లేకపోయినా ఇప్పించుకునేవారున్నారు. ప్రతిరోజూ పత్రిక చూడండి. ఎన్ని సన్మానాలు ? ఎంతమందికి? ఎలా జరుగుతున్నయో? అవన్నీ మనం చెప్పుకో తగ్గవికావా? ఇంతకూ మీకేలోపంలేకుండా ఉచితమర్యాదలు జరిగినట్టేనా? మీ ముగ్గురివరకూ మా బాధ్యతలు" అని ఇటూ అటూ చూశాడు నిత్యానందం.

అంతలో తన శాలువ భుజమ్మీదవేసుకుని చెప్పులు చేతపట్టుకుని మూడవ పండితుడు కర్రగేటుదాటి వెళ్ళిపోయాడు.

''అయ్యో, ఆయన వెళ్ళిపోతున్నారు?'' మహాలక్ష్మమ్మ బిగ్గరగా అంది కొడుకుతో.

"మాతో ఇంకా కొందరువచ్చారు. బహుశః వాళ్ళను కలుసుకోవటానికి వెళ్లాడేమో? అందరంకలిసి తెల్లవారిఐదుగంటలకు బయలుదేరాలి" అని మామూలు మాటగా అన్నారిద్దరూ.

నిత్యానందమూ మహాలక్ష్మమ్మ ముఖాలు చూసుకున్నారు.

——